ఆంధ్రజ్యోతి

andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.3, కనిష్ఠం 26.2





ఏజెన్సీ ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులు



బురదను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాంసి పాఠశాలలో బురద తొలగింపు

తాంసి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు బురదను తొలగించి ఆ పాఠశాల ప్రాంగణాన్ని బాగు చేశారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'అంతా బురదమయం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సంబంధిత అధికారులు ఉదయం నుంచి అక్కడ బురదను తొలగించి మొరం వేశారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమలను రాకుండా చర్యలు చేపట్టారు. పాఠశాల ప్రాంగణంతో పాటు పలుచోట్ల కూడా మురికి బురద ఉందని అక్కడి ప్రదేశాల్లో కూడా తొలగించాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు. మొత్తమీద విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. అంతేగాకుండా అంగన్‌వాడీ పిల్లలకు సైతం దోమలు కుట్టకుండా ఉండేందుకు తగిన చర్యలు చేపట్టారు.

'జొన్నల డబ్బులు ఇంతవరకు జమ చేయలేదు'

బోథ్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద నుంచి జొన్న పంట కొనుగోలు చేసి దాదాపు 45 రోజులు పూర్తి కావొస్తున్నా.. రైతులు విక్రయించిన జొన్నలకు సంబంధించిన డబ్బులు ఇంతవరకు జమ చేయలేదని మండల కేంద్రంలోని రైతులు పేర్కొన్నారు. ఆదివారం సమావేశమైన రైతులు ఈ విషయమై తీర్మానించారు. ప్రస్తుతం విత్తనాల కోసం డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని, ప్రభుత్వం జొన్నల డబ్బులు తక్షణమే వేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించడం జరుగుతుందన్నారు. అంతేగాక రైతు భరోసా డబ్బులు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారు ప్రభుత్వాన్ని విమర్శించారు. డబ్బులు జమ చేయకపోతే రైతులంతా మెరుపు ధర్నాలకు సిద్ధంగా ఉండాలని తీర్మానించుకున్నారు.

● ఉట్నూర్ మండలంలో సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం



రూ.200 కోట్ల వ్యయంతో..



సమీకృత గురుకులం

- పేద విద్యార్థుల కోసం ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్ మండలంలో ఏర్పాటు
- పులిమడుగు శివారులోని సర్వే నెం.41లో 25 ఎకరాల భూమి కేటాయింపు
- నాణ్యమైన విద్యతో పాటు ప్రత్యేక విద్యా బోధన
- విద్యార్థుల కోసం ఆధునిక వసతుల కల్పన
- త్వరలోనే అందుబాటులోకి రానున్న గురుకులం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఏజెన్సీ వాసులు

ఉట్నూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఖానాపూర్ నియోజక వర్గంలో ఉన్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజన, ఆధునిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం సమీకృత గురుకులం అందుబాటులోకి తెస్తుంది. 1977లో ఏర్పాటు అయిన ఖానాపూర్ నియోజకవర్గంలో ఐదు దశాబ్దాల అనంతరం ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు, గిరిజనేతరులు చదువుకునే విధంగా సమీకృత గురుకులం ఏర్పాటు కావడం పట్ల ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఉట్నూర్ మండలంలో ఏర్పాటు

ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్ మండలంలో సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం పూనుకుంది. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆలోచన మేరకు ప్రభుత్వం తలపెట్టిన ప్రతీ నియోజకవర్గానికి ఒక సమీకృత గురుకులం ఏర్పాటు చేయాలని భావిస్తుండగా.. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్ మండలానికి సమీకృత గురుకుల పాఠశాల ప్రభుత్వ మంజూరు చేసింది. ప్రభుత్వ పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ విద్యా శాఖ కార్యదర్శ ఆదేశాలు జారీ చేశారు. ఉట్నూర్ మండలంలోని కుమ్మరితండా సమీపంలో గల పులిమడుగు శివారులో రూ.200కోట్ల వ్యయంతో సమీకృత గురుకుల పాఠశాల నిర్మించనున్నారు. పులిమడుగు శివారులోని సర్వే నెం.41లో 25 ఎకరాల భూమిని సైతం సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి కేటాయిస్తున్నారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు భూమిని విద్యాశాఖ సంక్షేమ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించారు.

ఆధునిక సౌకర్యాల కల్పన

ఉట్నూర్ మండలంలో ఏర్పాటు కానున్న సమీకృత గురుకుల పాఠశాలను విశాలమైన 25 ఎకరాలలో రూ.200 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలు కల్పించేలా నిర్మించ తలపెట్టారు. ఐదు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 60 తరగతి గదులను, సిబ్బంది క్వార్టర్లు, ప్రిన్సిపాల్ నివాస భవనం, డార్మెంటరీ ప్రత్యేకంగా నిర్మించనున్నారు. విద్యార్థుల చదువుల కోసం స్మార్ట్ బోర్డులు, డిజిటల్ గ్రంథాలయం, కంప్యూటర్ శిక్షణ, క్రీడల కోసం ప్రత్యేక ఆట స్థలం కల్పించనున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యుత్ సౌకర్యంతో పాటు అదనంగా సౌరశక్తి వినియోగం ద్వారా కరెంట్ సౌకర్యం కల్పించనున్నారు. అదే విధంగా పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణం, పర్యావరణ పరిరక్షణ కోసం కూడా కృషి చేయనున్నారు.

పేద విద్యార్థులకు ఎంతో మేలు

ఖానాపూర్ నియోజకవర్గంలోని ఖానాపూర్, కడెం, దస్తూరాబాద్, పెంబి, సిరికొండ, ఇంద్రవెల్లి, ఉట్నూర్, జన్నారం మండలాల్లోని పేద విద్యార్థులకు సమీకృత గురుకులం పాఠశాల వరంగా మారనుంది. ఈ పాఠశాల

(తరువాయి 6వ పేజీలో...)

పేద విద్యార్థులకు వరం

: కందుకూరి రమేష్, మాజీ ఎంపీటీసీ, నాగపూర్



ప్రభుత్వం ద్వారా ఏజెన్సీ ప్రాంతంలోని పేద విద్యార్థుల కోసం సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటు చేయడం వరం. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు, మైనార్టీల కోసం ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు కాగా మొదటి సారిగా బీసీ, ఓసీ పేద విద్యార్థుల కోసం సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటు కావడం బాగుంది.

ప్రత్యేకంగా ఉట్నూర్ మండలానికి మంజూరు చేయించా

: వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్యే, ఖానాపూర్



ఉమ్మడి జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గం మూడు జిల్లాల్లో కేంద్రీకృతమై ఉంది. ఉట్నూర్ మండలంలో సమీకృత గురుకుల పాఠశాల మంజూరు చేయించడం ద్వారా ఎనిమిది మండలాల పేద విద్యార్థులకు ఈ పాఠశాల అందుబాటులో ఉంటుంది. ఖానాపూర్ నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఉన్నత చదువు అందించే పాఠశాలల ఏర్పాటుకు మార్గం కల్పిస్తున్నాం.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

రైతు సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు : జోగు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు వస్తేనే రైతులు గుర్తుకు వస్తున్నారే తప్ప రైతు సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలపై జైనథ్, బోరజ్, సాత్నాల, బేల మండలాల ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అసమర్థ విధానాలు ప్రజలకు వివరించాలని, వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలపై గ్రామీణ ప్రాంతాల్లోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలకు 420 హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ వాటి అమల్లో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. అన్నం పెట్టే రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ చదరంగం ఆడుకుంటుందని మండిపడ్డారు. ఇప్పటి వరకు నాలుగు ఎకరాలు, మూడు ఎకరాలు, ఒక ఎకరం ఉన్న రైతులకు సైతం రుణమాఫీ కాక పోవడంతో రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారన్నారు. ఇందులో పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో ప్రవేశం కోసం దరఖాస్తులు

ఉట్నూర్, జూన్15 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో ప్రవేశం కోసం అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారి షేక్ జావిద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతరులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బీసీలకు 51, ఎస్సీకు 12, ఎస్టీలకు తొండు, ఇతరులకు 5 ఉన్నాయని, అర్హులైన వారు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో, ఆధార్, బోనఫైడ్ ధ్రువపత్రాలు, రెండు పాస్‌ఫోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగతా వివరాల కోసం 9441908589 సంప్రదించాలన్నారు.

ఖోడద్‌లో ఘనంగా బోనాల పండుగ

● జూన్ మొదటి వారంలో అమ్మవారికి మొదటి పూజ ● శివసత్తుల విన్యాసాలు ● భాజాభజంత్రీల మధ్య బోనాల సమర్పణ




ఖోడద్‌లో అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు



..బోనాలతో తరలి వెళ్తున్న భక్తులు



బోనాల పండుగ సందర్భంగా శివసత్తుల విన్యాసాలు



సిర్సన్న(జె)లో కొలువుదీరిన రేణుక ఎల్లమ్మ



..నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయం



బోనం కుండలతో వస్తున్న మహిళలు

తలమడుగు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పండుగలో ముఖ్యమైన బోనాల పండుగను ఆదివారం తలమడుగు మండలంలోని ఖోడద్ గ్రామంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో గ్రామ దేవత పెద్ద పోచ్చమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. దీనిలో భాగంగా గ్రామంలో డప్పు భాజాలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాల కొండలతో, శివ సత్తువలు విన్యాసాలతో ఆలయానికి చేరుకుని, అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఆనంద్ మాట్లాడుతూ గ్రామస్తులందరూ ఐక్యతతో గత 20 సంవత్సరాల క్రితం గ్రామ దేవత పెద్దపోచ్చమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించుకున్నామని, ప్రతీ జూన్ మాసంలో అమ్మవారికి బోనాలను సమర్పిస్తున్నామన్నారు. పంటలు సమృద్ధిగా పండాలని పాడిపంట వృద్ధి చెందాలని, ప్రతీ ఇంటిలో ప్రతిఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండేలా అమ్మవారిని ప్రతీ యేడు కొలుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు చిలుకూరి వెంకట్ రెడ్డి, పన్నాల మోహన్ రెడ్డి, నారాయణ రెడ్డి, నిమ్మల లింగారెడ్డి, బోజా రెడ్డి, లక్ష్మారెడ్డి, మంత్రి స్వామి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

● సిర్సన్న(జె)లో బోనం ఎత్తిన మహిళలు

జైనథ్: జైనథ్ ఉమ్మడి మండలంలోని సిర్సన్న(జె)లో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గ్రామ ప్రజలు, మహిళలు సామూహిక బోనాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గల పోచమ్మ ఆలయంతో పాటు రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేగాకుండా డప్పులు భాజాల మధ్య పోచమ్మ, ఎల్లమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని మేకలను బలి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మద్దుల ఊశన్నలతో పాటు గ్రామ ప్రజలు, మహిళలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న మేఘాలు



● కరుణ లేని వరుణుడు
● చింతిస్తున్న అన్నదాతలు
● వర్షం కోసం ఎదురుచూపులు

7

రోడ్లపైన పశువులతో ప్రమాదాలు

● అయినా.. పట్టించుకోని యజమానులు
● చోద్యం చూస్తున్న స్థానిక అధికారులు





భీమన్న దేవుడి వద్ద పూజలు చేస్తున్న ముదిరాజ్ కులస్తులు



బోథ్‌లో బోనాలతో తరలి వెళ్తున్న మున్నూరుకాపు మహిళలు

ఘనంగా భీమన్న దేవుడికి బోనాలు

తాంసి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం భీమన్న దేవుడి పండగను ఆ సంఘం నాయకులు ఆదివారం తాంసిలో ఘనంగా నిర్వహించారు. ముందుగా డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యాలు సమర్పించి, కుల దైవానికి ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, గ్రామస్థులు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. గంగానీలతో భీమన్న దేవునికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం కోళ్లు, మేకలను బలిఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సంఘం అధ్యక్షుడు గుగ్గిల్ల పోచ్చన్న, మండల బీసీ యువజన విభాగం అధ్యక్షుడు దారవేణి రాఘవేంద్ర, సంఘం నాయకులు రమాకాంత్, సాయి, శ్రీనివాస్, శ్రీకాంత్, దేవన్న, తదితరులున్నారు.

● పటేల్స్ మున్నూరు కాపు ఆధ్వర్యంలో..

బోథ్: మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం పటేల్స్ ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు మల్లెపూల శివారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు, పురుషులు బోనాలు ఎత్తుకొని గ్రామంలోని ప్రధాన పోచమ్మ ఆలయాల వద్ద బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఏడాది పంటలు సమృద్ధిగా ఉండాలని వర్షాలు కురవాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఉపాధ్యక్షుడు మల్లెపూల మహేందర్, ప్రధాన కార్యదర్శి భువనగిరి కార్తీక్, కోశాధికారి భారీ నాగేందర్, లీగల్ అడ్వైజర్ కుమ్మరి విజయకుమార్, సభ్యులు పోతారెడ్డి, వీడిసి అధ్యక్షులు అల్లకొండ పోతన్న, ఆర్‌టివి ప్రసాద్, కుమ్మరి చంద్రశేఖర్, అడపా రాజేశ్వర్, తదితరులున్నారు.

నేడు రైతు నేస్తం వీసీ యూనిట్ ప్రారంభం

బోథ్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాట్నాపూర్ రైతు వేదికలో ఈనెల 16న సోమవారం నూతనంగా ఏర్పాటు చేసుకున్న రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌ను ప్రారంభించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రవితేజ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకుగా రైతులు, మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

'రేపు భవన సంక్షేమ కార్యాలయం ముట్టడి'

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయొద్దని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రాజు డిమాండ్ చేశారు. ఆదివారం నేతాజీచౌక్‌లోని కార్మిక అడ్డ వద్ద ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డును ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 17న హైదరాబాద్‌లోని భవనసంక్షేమ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఇచ్చోడలో ఆగని అక్రమ దందా!!

● పగలు, రాత్రి అనే తేడా లేకుండా యథేచ్ఛగా మొరం తరలింపు ● ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమార్కులు

ఇచ్చోడ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలో మొరం అక్రమ దందాపై పదే పదే ఫిర్యాదులందుతున్నా.. పలుమార్లు చర్యలు తీసుకుంటున్నా.. అక్రమార్కులు యథేచ్ఛగా చెలరేగిపోతున్నారు. కొండను తవ్వి మొరం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రీ, పగలు అనే తేడా లేకుండా ప్రకృతిని నాశనం చేస్తూ గుట్టలను తవ్వేస్తున్నారు. ఇచ్చోడ ప్రాంతంలో ఎర్రటి మొరానికి అత్యధిక డిమాండ్ ఉండడంతో ప్రభుత్వానికి తెలియకుండా కుప్టి నుంచి అక్రమంగా మొరం తరలించి కాసులే లక్ష్యంగా ప్రభుత్వ ఆదాయాన్ని గండికొడుతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మొరంను తరలిస్తున్నారు. అలాగే, ప్రభుత్వ అనుమతి లేకుండా కుప్టి నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఇచ్చోడలో ఒక్కో ట్రాక్టర్ రూ.1800 నుంచి రూ.2 వేలు, టిప్పర్ రూ.5వేల నుంచి రూ.6వేల వరకు విక్రయిస్తున్నారు. జాతీయ రహదారిపై దర్జాగా అక్రమంగా మొరం రవాణా కొనసాగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



పగటిపూట ట్రాక్టర్లలో తరలిస్తున్న ఎర్ర మొరం



రాత్రివేళల్లో ట్రాక్టర్లతో తరలిస్తున్న మొరం

రూ.200 కోట్ల వ్యయంతో సమీకృత గురుకులం

(5వ పేజీ తరువాయి...)

కోసం ప్రవేశ పరీక్ష రాసి సీటు పొందిన విద్యార్థి ఉచితంగా ఇంగ్లీష్ మీడియంలో చదువుకోవడానికి అవకాశం కలుగుతుంది.

పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ

ఇంగ్లీష్ మీడియంలో అనుభవజ్ఞుల ప్రత్యేక ఉపాధ్యాయులు అధ్యాపకులతో విద్యాబోధన సమీకృత గురుకుల పాఠశాలలో అందించనున్నారు. చదువుతో పాటు ఐఐటీ, నీట్ లాంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను తయారు చేసి ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. పిల్లల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. పౌష్టికరమైన ఆహారం, ప్రతీరోజు యోగ, వ్యాయామం లాంటి దిన చర్యలతో విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తారు.

అన్ని వర్గాల విద్యార్థులతో..

కులమతాలకు అతీతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులను అందరినీ కలిపి సమీకృత గురుకులం పాఠశాలలో ప్రవేశా లు కల్పించనున్నారు. నాల్గవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ స్థాయి వరకు మొత్తం రెండు వేల మంది పేద విద్యార్థులకు సమీకృత గురుకులంలో విద్య అందించేలా నిశ్చయించారు. దీంతో ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతాల అన్ని వర్గాల ప్రజలు సమీకృత గురుకులం అందుబాటులోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నివాళులర్పిస్తున్న సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు

తపస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తరగతి గదుల్లో విద్యార్థులకు విద్యను అందిస్తూ ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించడంలో భాగంగా తమ సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తపస్ జిల్లా అధ్యక్షుడు సునిల్‌చౌహాన్ అన్నారు. ఆదివారం న్యూరో వైద్యుడు డాక్టర్ గోవింద్ మందతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు వైద్యులు పరీక్షించి అవసరమైన మందులను అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సునిల్‌చౌహాన్ మాట్లాడుతూ న్యూరో సమస్యతో అనేక మంది బాధపడుతున్నారని, వైద్యులు కూడా తక్కువగా ఉండడంతో ఉచితంగా న్యూరో వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. శిబిరంలో దాదాపు 50 మంది వరకు హాజరైనట్లు పేర్కొన్నారు. శిబిరం నిర్వహణకు ముందుకు వచ్చిన వైద్యులకు సంఘం తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి శ్రీధర్, తపస్ సభ్యులు వల్ల బోజుగోపికృష్ణ, కటాస్ రాజేశ్వర్, మేస్రం రాజ్‌కుమార్, ప్రకాష్, సతీష్, గంభీర్, సాగర్ కేశవ్, తదితరులుపాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

● డాక్టర్ రవికిరణ్ యాదవ్

మావల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ నైపుణ్యాలు పెంపొందించుకొని ఆర్థికా భివృద్ధి సాధించాలని సినీ నిర్మాత, సాయి వైకుంఠ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారంసాయి వైకుంఠ ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సాయి వైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్, మగ్గం ఎంబ్రాయిడరీ, ఉన్ని దుస్తుల తయారీ, బ్యూటిషన్ కోర్సులలో మహిళలకు మూడు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈనెల 16 నుంచి 20వ లోపు అప్లై చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సాయి వైకుంఠ ట్రస్ట్ డైరెక్టర్స్ నల్ల విజయబాబు, మట్టా శ్రీనివాస్, నర్రా నవీన్ యాదవ్, రామన్న, హరిదర్ కౌర్, శ్రీనివాస్ యాదవ్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

పంటలు పండాలని ప్రత్యేక పూజలు

బోథ్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలో శాలివాహన సంఘం వారు తాత అయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ ప్రత్యేక బోనాలను వేయడం జరుగుతుందని మహిళలు తెలిపారు. మహిళలు, శాలివాహన సంఘం వారు పాల్గొన్నారు

'వృద్ధుల హక్కుల కోసం కృషి'

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వృద్ధులను గౌరవించడంతో పాటు వారిని ఆదరించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవ సందర్భంగా జిల్లా వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో సంఘం కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సామాజిక వేత్త ముడుపు మౌనిష్‌రెడ్డి హాజరై వృద్ధుల హక్కుల కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్‌దేశ్‌పాండే మాట్లాడారు. ఇందులో సమాఖ్య సభ్యులు పల్ల సత్యనారాయణ, నర్సింహులు, లక్ష్మారెడ్డి, గంగాధర్, శంకర్, రాంకులకర్ణి, రామారావ్, తదతరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మావల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆదివారం పలువురిని పరామర్శించారు. పట్టణంలోని తిర్పెల్లి కాలనీకి చెందిన కస్తాల అరుణ్‌కు ఇటీవల సర్జరీ జరిగిన వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్య నగర్ మాజీ కౌన్సిలర్, బిసి సంఘం ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్ ఇటీవల ప్రమాదవశాత్తు గాయాలపాలవడంతో వారిని పరామర్శించారు. అదేవిధంగా వార్డు నెం.3కి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు అబ్దుల్ వదూద్ మరణించగా వారి కుటుంబ సభ్యులను, బేలా మండల దహెగాంలో మాజీ జడ్పీటసీ రాందాస్ అత్తమ్మ మరణించగా వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పరామర్శించారు.

'విమాన ప్రమాదం బాధాకరం'

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించా రు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని కార్గిల్ పార్కులో అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ సునిల్‌కుమార్ మాట్లాడారు. ఇందులో సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రమోద్ కుమర్ ఖత్రి, గేడం మాదవ్, కందుల రవీందర్, సూర్యకాంత్, శశికాంత్, శ్రీకాంత్, సంతోష్‌అగర్వాల్, సుభాష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

దౌర్జన్యానికి పాల్పడ్డ ఇద్దరి రిమాండ్

ఇచ్చోడ, జూన్, 15 (ఆంధ్రజ్యోతి): షూరిటీపై ఇచ్చిన చెక్కులను తిరిగి ఇవ్వాలని కోరిన వ్యక్తిపై దౌర్జన్యానికి పాల్పడ్డ ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బండారి రాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలంలోని అడేగామ(బి) గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ అనే యువకుడు పాన్‌పట్టె సురేష్ వద్ద నుంచి రవి అనే వ్యక్తికి రూ. 5లక్షలు అప్పుగా ఇవ్వగా.. ఆ డబ్బులకు సంబంధించి జ్ఞానేశ్వర్ షూరిటీగా తన చెక్కులను ఇవ్వడం జరిగింది. ఇచ్చిన డబ్బులు ముట్టినప్పటికీ చెక్కులు తిరిగి ఇవ్వకపోగా అతనిపై దౌర్జన్యానికి దిగాడు. ఈనెల 12వ తేదీన జ్ఞానేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాన్‌పట్టె సురేష్, పాన్‌పట్టే సుభాష్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

గట్టు మైసమ్మ క్షేత్రాన్ని ఆదర్శ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతా

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, జూన్15 (ఆంధ్రజ్యోతి): భైంసాలోని మహిమాన్విత ఆలయం గట్టు మైసమ్మ క్షేత్రాన్ని ఆదర్శ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం రూ.5లక్షలతో గట్టు మైసమ్మ క్షేత్ర మెట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యతానుసారం దశలవారీగా క్షేత్రానికి అవసమైన అన్నిరకాల వసతులు, సౌకర్యాలు కల్పిస్తానని వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేపడుతామని తెలిపారు. ఆలయ కమిటీ తెలిపిన సమస్యల పరిష్కారం, అవసరమైన అభివృద్ధి పనుల మంజూరి కోసం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ పార్టీ శ్రేణులతో కలిసి ఆలయంలో పూజలు చేసి పలురకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు రావుల రాము, హిందూవాహిని రాష్ట్రప్రతినిధి చింతపండు మహేష్, మహాలక్ష్మీ జ్యువెల్లరీ మార్కెట్ ప్రధాన కార్యదర్శి కోర్వ శ్రీకాంత్, గట్టు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు రావుల పోశెట్టి, గట్టు, మాజీ మున్సిపల్ చైర్మెన్ బి. గంగాధర్, పలువురు పాల్గొన్నారు.

భారతీయ జనతా పార్టీతోనే దేశం అభివృద్ధి

కుంటాల: బీజేపీ పాలనతో దేశం అభివృద్ధి పథకంలో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కుంటాలలో నరేంద్ర మోడీ 11ఏళ్ల పాలన సందర్భంగా కుంటాలలో బీజేపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, భైంసా పట్టణ అధ్యక్షులు రాము, కుంటాల మాజీ ఎంపీపీ అప్కగజ్జారాం యాదవ్, కుబీర్, కుంటాల మండలాల బాధ్యులు దత్తాత్రి, పసుల నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో 140 కోట్ల ప్రజలకు ఉచితంగా వ్యాక్సిన్ అందించిన ఘనత నరేంద్ర మోడీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి ప్రస్తుతం పేద ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యవర్గ సభ్యులను సన్మానించారు.

పాఠశాలలో చేరేందుకు ఎంపిక పోటీలు

కుంటాల, జూన్15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశం కోసం ఈనెల 18వ తేదీన కుంటాల మండలంలోని కుంటాల హైస్కూల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో ముత్యం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొనాలని, వివిధ పాఠశాలల్లో పీఈటీలు, పీడీలు విద్యార్థులను ప్రోత్సహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన సూచించారు.

పాలనపై చెరగని ముద్ర

● రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన బాలశక్తి ● 19వేల మంది విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్
● బాసర ఆలయం, కడెం ప్రాజెక్టు, నిర్మల్ కోటల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ
● పథకాల అమలులో పారదర్శకత ● నేటితో ఏడాది పాలన పూర్తి



నిర్మల్, జూన్15 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి అభిలాష అభినవ్ బాధ్యతలు చేపట్టి నేటితో ఏడాది పూర్తయింది. పాలనలో తనదైన ముద్ర వేస్తూ వివిధ రంగాల్లో ప్రగతికి పునాది వేశారు. బాలశక్తి మొదలుకొని భూముల రక్షణ, విద్యా, వైద్యం, సంక్షేమ పథకాల అమలులో ఆమె విశేషంగా కృషిచేశారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అభిలాష అభినవ్ చేస్తున్న కృషిని పలువురు కొనియాడారు.

బాలశక్తి పథకానికి రాష్ట్ర వ్యాప్త గుర్తింపు

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టితో కలెక్టర్ అభిలాష అభినవ్ నిర్మల్ జిల్లాలో 2024 సెప్టెంబరు 20న 'బాలశక్తి' కార్యక్రమం ప్రారంభించారు. 19వేల మంది విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్, 1274 మందికి కంటి అద్దాలు అందించారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు పొందింది. ఈ పథకం విజయవంతంగా సాగుతోంది.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

నిర్మల్‌కలెక్టర్‌గా తాను బాధ్యతలను చేపట్టిన నాటి నుండి అభిలాష అభినవ్ జిల్లాలో విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ రెండు విభాగాల్లో కలెక్టర్ విప్లవాత్మక మార్పులు తెచ్చారు. అంగన్‌వాడీ నుంచి ఉన్నత పాఠశాలల వరకు సదుపాయాలు మెరుగుపరచడంతోపాటు హాస్టళ్లలో రాత్రిపూట ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యార్థులతో కలెక్టర్ రాత్రి బస చేస్తూ వారి సమస్యలు విన్నారు. వైద్య రంగంలో పలు ఆరోగ్య కేంద్రాలు బలోపేతం చేశారు. ఖానాపూర్ ఆసుపత్రిలో కొత్తగా ఆర్థో విభాగం ఏర్పాటైంది. జిల్లా ఆసుపత్రిలో డాక్టర్లు నియామకమవ్వడంతో ప్రసూతుల సంఖ్య పెరిగింది. విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన కలెక్టర్ భూముల రక్షణపై సైతం అదే స్థాయిలో స్పందించారు. జిల్లాలో ఆక్రమించిన ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనం చేశారు. భైంసా, నర్సాపూర్(జి), లోకేశ్వరం ప్రాంతాల్లో రూ. కోట్ల విలువైన భూముల స్వాధీనం చేసుకున్నారు.

నిర్మల్ ఉత్సవాలతో చరిత్రకి వెలుగు

ఎన్నో చారిత్రక ఆనవాళ్లను కలిగి ఉన్న నిర్మల్ జిల్లా చరిత్ర, సాంస్కృతిక వైభవాన్ని ప్రజల దృష్టికి తీసుకొచ్చేందుకు కలెక్టర్ చేసిన ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయి. జిల్లాకేంద్రంలో తొలిసారి 'నిర్మల్ ఉత్సవాలు' నిర్వహించారు. చరిత్రకారులు, కళాకారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఘనంగా నిర్వహించారు. ఈ చరిత్ర ఉత్సవాలలో నిర్మల్ జిల్లా ఘనమైన చరిత్రను మరోసారి ప్రజల ముందుకు తెచ్చి శభాష్ అనిపించుకున్నారు.

పథకాల అమలులో పారదర్శకత

ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేయడంలో కలెక్టర్ పారదర్శకతను కనబరుస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పంపిణీ, భూముల సమస్యల పరిష్కారానికి రెవెన్యూసదస్సులు, ధాన్యం కొనుగోళ్లలో ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ప్రజల ఫిర్యాదులకు స్పందిస్తూ 'ప్రజావాణి' కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. మహిళా సంక్షేమానికి ముందడుగు మహిళా సంఘాలకు క్యాంటీన్లు, రుణ వితరణతో పాటు త్వరలో పెట్రోల్ బంక్‌లు నిర్వహణకు అవకాశమిస్తుండగా... మైత్రి క్లినిక్, డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్‌లు ఏర్పాటు చేశారు. మహిళా శక్తి భవనం త్వరలో ప్రారంభం కానుంది. క్రీడల్లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టడంతో జిల్లా విద్యార్థులు సీఎం కప్‌లో 26 పతకాలు సాధించారు. నాలుగు బంగారు, 8 వెండి, 14 కాంస్య పతకాలతో రాష్ట్రవ్యాప్తంగా నిలిచారు. క్రీడల ప్రోత్సాహానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు.

పాలనపై తనదైన మార్క్

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అభిలాష అభినవ్ తీసుకుంటున్న నిర్ణయాలతో పాలనపై తనదైన మార్క్‌ను వేసుకున్నారు. రాబోయే రోజుల్లో బాలశక్తిని జడ్పీ పాఠశాలలకు విస్తరించే లక్ష్యం, భైంసాలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు, మినీ ట్యాంక్ బండ్, ధర్మసాగర్ చెరువుల అభివృద్ధికి చర్యలు, బాసర ఆలయం, కడెం ప్రాజెక్టు, కోటల అభివృద్ధికి ప్రణాళికలు, పార్కుల అభివృద్ధి, హాస్టళ్ల నిర్మాణం, వృద్ధాశ్రమాల ఏర్పాటుకు కసరత్తు చేస్తూ జిల్లావాసులతో మన్ననలు పొందుతున్నారు.

అర్ధరాత్రి డీసీసీబీ డైరెక్టర్ కిడ్నాప్

● రూ.3కోట్లు డిమాండ్ ● తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద తప్పించుకున్న హరీష్ కుమార్



నిర్మల్ అడిషనల్ ఎస్పీ కార్యాలయానికి తీసుకువస్తున్న తూప్రాన్ పోలీసులు

మామడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా మామడ మాజీ ఎంపీపీ, ఆదిలాబాద్ జిల్లాకేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు చిక్యాల హరీష్ కుమార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆదివారం తెల్లవారు జామున 2గంటల ప్రాంతంలో మామడ మండలం పొన్కల్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. ఆయన నివాసంలో నుంచి నిద్రలేపి వాహనంలో గుర్తుతెలియని దుండగులు కిడ్నాప్ చేసినట్లు చెబుతున్నారు. రూ.3కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఆగంతకులు కారులో హైదరాబాద్ వైపు తరలించారు. అదే సమయంలో హరీష్ కుమార్ తన సన్నిహితులకు ఫోన్‌చేసి కొంత నగదు కావాలని కోరినట్లు కూడా చెబుతున్నారు. కిడ్నాప్‌లో భాగంగా హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద ఆగిన సమయంలో చాకచక్యంగా హరీష్‌కుమార్ కిడ్నాపర్ల చెర నుంచి తప్పించుకున్నారు. అక్కడినుంచి నేరుగా తూప్రాన్ పోలీస్‌స్టేషన్ వెళ్లి జరిగిన ఘటన గురించి అక్కడి పోలీసులకు వివరించారు. తూప్రాన్ పోలీసులు మామడ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు చెబుతున్నారు. హరీష్ కుమార్ తెలిసిన వ్యక్తులే ఈ కిడ్నాప్ చేసినట్లు జిల్లాలో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆయన్ సేఫ్‌గా ఉన్నారు. విచారణ జరుపుతున్నామని, వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని మామడ ఎస్సై అశోక్ తెలిపారు. కాగా ఈ ఘటన నిర్మల్ జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది. కిడ్నాప్ జరిగిన మాట నిజమేనని తాను ప్రస్తుతం సేఫ్‌గా ఉన్నానని, ఎవరూ ఆందోళన చెందవద్దని హరీష్ కుమార్ తమ సన్నిహితులకు ఫోన్ చేసి చెప్పారు.

పొన్కల్ గ్రామానికి పోలీసులు, క్లూస్ టీం

మామడ మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన హరీష్ కుమార్ ఇంటికి వెళ్లి నిర్మల్ జిల్లా పోలీసులతోపాటు క్లూస్‌టీం అధికారులు వేలిముద్రల వివరాలను సేకరించారు. ఈ ఘటనపై మామడ ఎస్సై అశోక్‌ను సంప్రదించగా కిడ్నాప్ జరిగిన మాట వాస్తవమేనని, కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.




తూప్రాన్ టోల్ ప్లాజాలో హరీష్ కుమార్ కారు దిగుతున్నట్లు సీసీ ఫుటేజ్



చెత్తతో కంపుకొడుతున్న ఆసుపత్రి ఆవరణ

చెత్త సేకరణలో నిర్లక్ష్యం

కుబీర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కుబీర్‌లోని ప్రధాన రోడ్ల వెంట కుప్పలు తెప్పలుగా చెత్త పేరుకుపోయింది. గతంలో స్వచ్ఛతలో పేరు పొందిన జీపీ ఇప్పుడు పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రోడ్డు వెంట పేరకు పోయిన చెత్త తరలించడం లేదు. బజారు రోడ్డు చెత్తమయంగా మారిపోయింది. చెత్త ట్రాక్టరు రాక పోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. చెత్తకుప్పల వెంట పందులు స్వైర విహారం చేస్తుండడంతో ఆ మార్గాన వెళ్లే గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య వ్యవస్థను మెరుగు పరచాలని కోరుతున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద చెత్తకుప్ప ఇలా..

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

కుంటాల, జూన్15 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీఏవో అంజి ప్రసాద్ అన్నారు. ఆదివారం కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలో ఎరువుల దుకాణాన్ని ఆయన పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించకూడదని సూచించారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణంలో విత్తన ప్యాకెట్లను ఆయన పరిశీలించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో తప్పని సరిగా రశీదు పొందాలన్నారు.



కల్లూరులో ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో అంజి ప్రసాద్

ఫటా.. ఫట్...

అనాథ బాలికల చదువులకు..
ఆపన్న హస్తమే కేజీబీవీలు

● రాంపెల్లి నవిత, ప్రత్యేక అధికారిణి, లక్ష్మణచాంద



ఆంధ్రజ్యోతి: కస్తూర్బా గాంధీ విద్యాలయ ప్రవేశాలలో ప్రధానంగా ఎవరికి ప్రాధాన్యం ఇస్తారు.?

ప్రత్యేక అధికారి: ప్రధానంగా పేద నిరుపేద కుటుంబాలకు చెందిన అనాథ బాలికలకు ప్రాధాన్యత ఇస్తాం. తల్లిదండ్రి మరణించిన వారికి లేదా ఈ ఇద్దరిలో ఎవరో ఒకరు మరణించిన వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తాం. ఆ తరువాత నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రవేశాలు కల్పిస్తాం.

ఆంధ్రజ్యోతి: హైస్కూల్‌లో ప్రస్తుతం ఉన్న విద్యార్థినుల సంఖ్య ఎంత?

ప్రత్యేక అధికారి: నూతన ప్రవేశాల అనంతరం 280 సంఖ్యను మించే అవకాశం ఉంది. ప్రవేశాలు ఇంకా కొనసాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: ఇంటర్మీడియట్‌లో ఉన్న బాలికల సంఖ్య ఎంత..? ఎలాంటి కోర్సులు బోధిస్తున్నారు...?

ప్రత్యేక అధికారి: ఇంటర్మీడియట్‌లో కూడా నూతన ప్రవేశాల అనంతరం 150 సంఖ్యను దాటే అవకాశం ఉంది. ఇందులో కూడా ప్రవేశాలు కొనసాగుతున్నాయి. పాఠశాల, కళాశాలలోని బాలికల సంఖ్య 430 దాటే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎంపీసీ, బైపీసీ కోర్సులను బోధిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గత విద్యా సంవత్సరంలో పాఠశాల ఉత్తీర్ణత శాతం ఎంత? తొంభై శాతం పైగా మార్కులు వచ్చిన విద్యార్థులు ఎందరు..?

ప్రత్యేక అధికారి: గత విద్యాసంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాం. ఐదుగురు విద్యార్థులకు 90 శాతంకు పైగా మార్కులు సాధించారు.

ఆంధ్రజ్యోతి: బోధనతో పాటు మీరు ప్రోత్సహించే ఇతర యాక్టివిటీస్ ఏమిటి...?

ప్రత్యేక అధికారి: ఉత్సాహం ఉన్న బాలికలను అన్ని రకాల క్రీడలు, కల్చరల్ యాక్టివిటీస్‌లో పాల్గొనేలా చూస్తాం. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తాం.

● (లక్ష్మణచాంద, ఆంధ్రజ్యోతి)

అరకొరగా దిగుమతులు.. అధికమవుతున్న ధరలు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన టమాట దిగుబడులు



టమాట బాక్స్‌లను కొనుగోలు చేసి తీసుకువెళుతున్న రిటైల్ విక్రయదారులు



ఆటో ద్వారా సరఫరా అయిన పచ్చిమిర్చి దిగుబడులు

ప్లాస్టిక్ కవర్లలో సరఫరా అయిన కొత్తిమీర దిగుబడులు

● స్థానికంగా లభ్యతలేని కూరగాయల దిగుబడులు ● ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి దిగుమతి అవుతున్న టమాట
● మహారాష్ట్ర నుంచి కొత్తిమీర, పచ్చి మిర్చి ● మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి క్యాబేజీ, కాలిఫ్లవర్, మునగ ● కొనుగోళ్లకు పోటి పడుతున్న రిటేల్ విక్రయదారులు

భైంసా, జూన్ 15: ప్రతికూల పరిస్థితులతో ఇక్కడి ప్రాంతంలో కూరగాయల దిగుబడులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. గత నెల చివరి వరకు తీవ్రమైన ఎండల వేడిమికి తోడు భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీటి తడులు అందక సాగులోనున్న పైర్లు దెబ్బతిన్నాయి. అటు తరువాత అశాజనకంగానున్న కూరగాయల దిగుబడులను అకాల వర్షాలు దెబ్బతీసాయి. ఇక అక్కడక్కడ సాగులో నున్న కూరగాయల పంటలపై తెగుళ్ల బెడద అధికమవుతుండటంతో దిగుబడులపై ప్రభావం చూపాయి. ఈ కారణంగా జిల్లాలో ప్రస్తుతం కూరగాయల దిగుబడులు నామమాత్రంగా వస్తున్నాయి. దీంతో ఇక్కడి రిటైల్ వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగు మతులు చేసుకుంటున్నారు. సుదూరంలోనున్న వివిధ రాష్ట్రాల నుంచి కూరగాయలను దిగుమతి అవుతుండటంతో ధరలు అధికమవుతున్నాయి. అక్కడి నుంచి సైతం డిమాండ్ తగ్గ రీతిలో కూరగాయల సరఫరా లేక పోవడంతో రిటేల్ వ్యాపారుల మధ్య పోటీ ఏర్పడుతోంది. ఫలితంగా వినియోగదారులపై ధరాఘాత భారం పెరుగుతూ పోతోంది.

● పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతులు

ప్రస్తుతం రాష్ట్రంలో ఎండల ప్రభావం తగ్గిపోయినప్పటికి వరుణుడి కరుణ ఆశించిన మేర లేకుండా పోయింది. దీంతో ఎక్కడ కూడా కూరగాయల దిగుబడులు సంతృప్తికరంగా లేకుండా పోయాయి. సమస్య నివారణకు గాను ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని హోల్ సేల్ వ్యాపారులు ఇక్కడి మార్కెట్లకు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, అంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకుంటూ క్రయ, విక్రయాలు జరుపుతున్నారు. జిల్లాకు ప్రస్తుతం టమాటలు ఆంధ్రప్రదేష్ రాష్టంలోని చిత్తూర్ జిల్లా మదనపెల్లి , మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని చిన్వా డ ప్రాంతం నుంచి సరఫరా అవుతున్నాయి. ఇక మహారాష్ట్రలోని లా తూర్ ప్రాంతం నుంచి కొత్తిమీర, నాసిక్ ప్రాంతం నుంచి పచ్చిమిర్చి దిగుమతి చేసుకుంటున్నారు.ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేష్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి క్యాబేజి, కాలిఫ్లవర్, మునగ, క్యాప్సికామ్, తొండకాయలతో పాటు ఇతర కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం బీరకాయ, బెండకాయ, వంకాయలు దిగుబడులు నామమాత్రంగా లభ్యమవుతున్నాయి.

● రిటైల్ వ్యాపారుల మధ్య పోటీతో ధరలకు రెక్కలు

జిల్లాలోని వినియోగదారులకు సరిపోయేంతగా కూరగాయల దిగుమతుల సరఫరా కావడం లేదు. అరకోరగా కూరగాయలు సరఫరా అవుతుండటంతో వాటిని కొనుగోలు చేసుకునేందుకు గాను రిటేల్ వ్యాపారులు ఎగ బడుతున్నారు. వీరి మధ్య పోటీ నెలకొంటుండటాన్ని అసరాగా చేసుకుంటున్న హోల్ వ్యాపారులు ధరలను ఇష్టారాజ్యంగా పెంచుతున్నారు. ఈ ప్రభావం ప్రత్యక్షంగా రిటేల్ వ్యాపారులపై ఉంటుండగా పరోక్షంగా విని యోగదారులపై అధికంగా పడుతోంది. గత నెలతో పోల్చి చూస్తే ప్రస్తుతం కూరగాయల ధరలు రెట్టింపు స్థాయికి చేరుకున్నాయి. ప్రతికూల వాతవరణం, మార్కెట్ పరిస్థితులతో అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగిపోయాయి.

● మరో నెలన్నర రోజులు ఇదే పరిస్థితి

ప్రస్తుతం నెలకొని ఉన్న వాతవరణ పరిస్థితుల దృష్ట్యా కూరగాయల ధరల పెరుగుదల మరో నెలన్నర రోజులు పాటు కొనసాగే అవకాశం ఉంది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే కూరగాయల సాగు మొదలయ్యింది. దిగుబడులు చేతికి రావాలంటే నెలన్నర రోజులకు పైగానే కాలం పట్టనుంది. ఈ క్రమంలో ఇతర ప్రాంతాల నుంచి కూరగాయల దిగుబడులు చేసుకోవడం తప్పనిసరిగా మారింది. సుదూరం నుంచి కూరగాయలు వస్తుండటంతో ధరాఘాతం కొనసాగనుంది. ఇక్కడి దిగుబడులు మార్కెట్‌కు వస్తే గాని ధరలు తగ్గుముఖం పట్టే పరిస్థితులు లేవని కూరగాయల వ్యాపారులు పేర్కొంటున్నారు.



ద్విచక్ర వాహనంపై కూరగాయలు తీసుకువెళుతున్న రిటైల్ విక్రయదారుడు

అసంపూర్తి పనులతో వాహనదారులకు అవస్థలు

కుభీర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మల్లేశ్వర్ తండాకు వెళ్లే మార్గంలో బీటీరహదారి నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఐటీడీఏ నిధులతో కంకర పరిచి వదిలేశారు. దాదాపు రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న పనులు పూర్తి కావడం లేదు. దీంతో నిర్లక్ష్యం కుభీర్ మండల కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర వైద్య సేవలకు అంబులెన్సు వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులను పూర్తి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



కంకర వేసి వదిలేసిన మల్లేశ్వర్ తండా రోడ్డు

రేషన్ కోసం తప్పని తిప్పలు

బోథ్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరలపెల్లి గ్రామంలో ఉన్న డీఆర్ డిపో ద్వారా నిత్యావసర సరుకులను విక్రయిస్తున్నారు. అయితే రేషన్ బియ్యం కోసం మండలంలోని చింతగూడ, బాబెరా తదితర మారుమూల గ్రామాల నుంచి బియ్యం కోసం లబ్ధిదారులు వస్తుంటారు. అయితే సంబంధిత డీఆర్ డిపో సెల్ సిమెంట్ సకాలంలో షాపును తీయకపోవడం వల్ల ఆయన రాక కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని లబ్ధిదారులు వాపోతున్నారు.

● పొలంలోకి వెళ్లలేక పోతున్నాం

డీఆర్ డిపో నిర్వహణలో సమయపాలన లేక పోవడంతో ఫామ్ ఇబ్బందులకు గురవుతున్నామని రేషన్ కార్డుదారులు అంటున్నారు.

● చెప్పులు, బస్తాలు లైన్‌లో పెట్టి

డిఆర్డిపో సేల్స్ మేనేజర్ సకాలంలో రాకపోవడంతో లబ్ధిదారులు తమ వెంట తెచ్చుకున్న బస్తాలు చెప్పులను లైన్‌లో పెట్టి వారి వారి పనులు చేసుకుని తిరిగి వచ్చి బియ్యం తీసుకుంటున్నారు. అయితే బియ్యం కోసం తమ దినసరి కూలి వృధా అవుతుందని వాపోయారు. అధికారులు డిఆర్డిపో సమయపాలన పాటించే విధంగా చూడాల్సిన అవసరం ఉందని అంటున్నారు.



మరలపల్లి గ్రామం డీఆర్ డిపో వద్ద సేల్స్‌మెన్ రాకపోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

శిథిలావస్థలో పశు వైద్యశాల

● తడిసి ముద్దవుతున్న మందులు, రిజిస్టర్లు ● పట్టించుకోని పాలకులు, జిల్లా అధికారులు

కుభీర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షానికే మొత్తం గదులు ఊరుస్తుండడంతో విలువైన మందులు, కాగితాలు, పలు రికార్డులు తడిసి పోతున్నాయి. ఇక్కడి పశువైద్యాధికారి పశు వైద్యశాల భవనానికి తాత్కాలి మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులకు నివేదికలు రూపొందించి అందించిన ఏ మాత్రం ఫలితం లేకుండా పోతోంది. ఈ వైద్యశాల పరిస్థితిని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావుపాటిల్‌కు పలుమార్లు విన్నవించి వినతిపత్రం అందించిన స్పందన లేకుండా పోయింది. శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని తొలగించి కొత్తది నిర్మిస్తేనే ఉపయోగం ఉంటుందని పశుపోషకులు పేర్కొంటున్నారు.ఇప్పటికయినా ఎమ్మెల్యే, జిల్లా అధికారులు దృష్టి సారించి వెంటనే మరమ్మతులు చేయించడమో లేదా నూతన భవనం నిర్మించడం చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఈ భవన పరిస్థితిపై పశువైద్యాధికారి విశ్వజిత్ పాటిల్‌ను వివరణ కోరగా వైద్యశాల భవనానికి మరమ్మతులు చేయించాలని ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యేకు విషయం తెలియజేసి నివేదికలను అందించామని, నూతన భవనం నిర్మించాలని వివరించారు.



కుభీర్‌లో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాఖ భవనం

రోడ్లపైన పశువులు.. ప్రమాదాలకు నెలవులు!

● పట్టించుకోని యజమానులు ● చోద్యం చూస్తున్న అధికారులు

ఉట్నూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులపై పశువులు సంచరిస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్లపైన పశువులు ఉన్న యజమానులు ఏమాత్రం పట్టించుకోకపోవడం వల్ల ద్విచక్ర వాహనదారులతో పాటు కార్లలో ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం ఉట్నూర్ సమీపంలో ఉన్న నాగశేషుని ఆలయం వద్ద ఉన్న ప్రధాన రహదారిపై రెండు పశువులు కొట్లాడి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కారును ఢీకొట్టాయి. పశువు బలంగా కారును ఢీకొట్టడంతో అది మృతి చెందగా కారు అదుపు తప్పి పొలంలోకి దూసుకు పోయింది. ఉట్నూర్ పట్టణంలోని ఎన్టీఆర్‌చౌరస్తా, కొట్నాక్ భీంరావ్‌చౌక్, ఐటీడీఏ కార్యాలయం ముందు, అంబేద్కర్‌చౌక్, జగ్జీవన్‌రాంచౌక్, పాత ఉట్నూర్, తుకారాంచౌక్, షాంపూర్ ప్రాంతాల్లో పశువులు రోడ్లపైనే సంచరించడంతో పాటు రోడ్లపైనే కూర్చుంటున్నాయి. ఫలితంగా బస్సుల్లో, ఇతర వాహనాల్లో వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతుండగా ద్విచక్ర వాహనదారులు స్పీడు కంట్రోల్ కాక పశువులను ఢీకొట్టి పడిపోతున్నారు. ఉట్నూర్ సబ్ డివిజన్ పోలీసు అధికారి కాజల్‌సింగ్ సైతం పశువుల యజమానులను హెచ్చరిస్తూ రోడ్ల పై పశువులను సంచరించకుండా చూసుకోవాలని ఆదేశించారు. అయినా పశువుల యజమానులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నందున పంచాయతీ అధికారులు పశువుల యజమానులపై కేసులు పెడితే రోడ్ల ప్రమాదాలు నివారించవచ్చని ప్రజలు అంటున్నారు.



పాత ఉట్నూర్ వద్ద రోడ్డు పై ఉన్న పశువులు

ఊరిస్తున్న మేఘాలు

● కరుణ లేని వరుణుడు
● చింతిస్తున్న రైతన్న

బోథ్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు నాటి రైతులు వారం రోజులు కావస్తుండడంతో భూమిలో వేసిన విత్తనం మొలకెత్తుతుందో లేదో అన్న ఆందోళనలో రైతుల దిగాలు చెందుతున్నారు. గత మూడు రోజుల నుంచి సాయంత్రం పూట ఆకాశం కమ్ముకు వస్తుండడం వల్ల రైతులు వర్షం కురుస్తుందేమోనని ఆశగా ఆకాశం కేసి చూస్తున్నారు. మేఘాలు మాత్రం నల్లగా ఆకాశంలో కనిపిస్తూనే చుక్క రాల్చకుండా వెళ్లిపోతున్నాయి. రైతుల ఆశలు అడియాశలవుతున్నాయి.




ఆదివారం సాయంత్రం మండలంలో కమ్ముకున్న మేఘాలు

● అంకురానికి ఆపద తప్పదా

భూమిలో నాటిన అంకురం విత్తనానికి ఆపద తప్ప దేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. భూమి తేమతో ఉన్న సమయంలో ఆశతో విత్తనాలు నాటితే సరైన వర్షాలు లేకపోవడంతో విత్తనాలు మొలకెత్తడం లేదని రైతుల ఆందోళన చేస్తున్నారు. కూలీలు పెట్టి ఎరువులు చల్లి విత్తనాలు నాటితే వర్షాలు ఇప్పుడు ఒక భూమిలో అనే విత్తనాలు చెడిపోయే ఆస్కారం ఉందని రైతులు అంటున్నారు. మొదలే అప్పులు చేసి పంట పెట్టుబడులు పెడితే మరోసారి విత్తనాలు కొనుగోలు చేయాలంటే తలకు మించిన భారంగా అవుతుందని రైతులుఆందోళన చేస్తున్నారు.

● వర్షాల కోసం మొక్కులు

మృగశిర కార్తె ముందే మురిపించి ఆ తర్వాత మేఘాలు మొహం చాటియడంతో రైతులు ఇదేం కాలం అంటూ వారిలో వారే కుమిలిపోతున్నారు. ప్రభుత్వం కనీసం పంట పెట్టుబడి సహాయం కింద రైతు బంధు పంపిణీ చేసి ఉంటే కొంతైనా మేలు జరిగేదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోవైపు వేలాది మంది రైతులు ప్రభుత్వం కొనుగోలు చేసిన జొన్న పంటకు సంబంధించిన డబ్బులన్న ఇవ్వాలని కోరుతున్నారు.



నేడు రైతులతో వీడియో కాన్ఫరెన్సు

తానూర్, జూన్15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం సాయంత్రం 4గంటలకు రైతులతో వీడియో కాన్ఫరెన్సు ఉంటుందని మండల వ్యవసాయ అధికారి సంఘవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు నేస్తం మూడో విడతలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్సింగ్ యూనిట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ప్రారంభించి ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



నదీ తీరంలో.. మరణ మృదంగం

- నిద్రమత్తులో యంత్రాంగం
- బాసరలో కనిపించని రక్షణ చర్యలు
- అమ్మవారి దర్శనానికి వచ్చి భక్తుల మృత్యువాత
- ఆప్తులను కోల్పోయి దుఖంతో వెనుదిరుగుతున్న భక్తులు
- తరచూ ఘటనలు జరుగుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం

బాసర, జూన్15 (ఆంధ్రజ్యోతి): బాసర గోదావరి నదీ తీరంలో మరణ మృదంగం మోగుతోంది. జ్ఞానసరస్వతీ అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులు నదీ తీరానికి వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు. అధికారులు నిద్రమత్తు వీడకపోవడంతో భక్తుల ప్రాణాలు గంగలో కలుస్తూనే ఉన్నాయి. మూడు వారాల వ్యవధిలో రెండు ఘటనలు చోటుచేసుకోగా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఆదివారం హైదరాబాద్‌కు చెందిన రాజస్థానీ భక్తులు బాసర సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చి గోదావరి నది మధ్యలోకి వెళ్లి స్నానం చేస్తూ ఐదుగురు యువకులు నీటిలో మునిగి మృతిచెందారు. అధికార యంత్రాంగం కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ ఘటనచి జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోంది. గోదావరి నీటిమట్టంలో వరుస ప్రమాదాలు జరగడం అందరినీ కలిచివేస్తుంది. గోదావరిలో వేసవి వల్ల నీరు తగ్గి అక్కడక్కడ భక్తులు లోతైన ప్రదేశాలు ఉన్నాయనే విషయం తెలియక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రతీ ఏడాది ఇలా ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటివరకు సుమారు 15మంది ప్రాణాలు కోల్పోయారు. అయినప్పటికీ అధికారులు మాత్రం నదీ తీరం వద్ద రక్షణ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ఘటన జరిగినప్పుడు హడావుడి తప్ప క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలు శూన్యమని తెలుస్తోంది. నిత్యం వేలాది మంది భక్తులు నదీ తీరాన వస్తున్నప్పుడు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అక్కడి అధికారులపై ఉంది. ఆలయం నుంచి ఆదాయం వస్తున్నా అధికారుల చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే ఒకరిద్దరు గజ ఈతగాళ్లను నియమించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలున్నాయి. అక్కడవారు విధులు నిర్వహిస్తున్నారా.. లేదా అని పర్యవేక్షించే వారే లేరు. అధికారుల నిర్లక్ష్యంతోపాటు ఇక్కడ బోటు నిర్వాహకుల తీరుపై కూడా విమర్శలు వెల్లువెత్తున్నాయి. సంపాదనపై దృష్టిభక్తుల రక్షణను గాలికి వదిలేశారు. కళ్లేదుటే భక్తులు నీటిలో మునిగిపోతున్నా రక్షించలేకపోతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఆదివారం సైతం కుటుంబ సభ్యులే నది మధ్యలో నుంచి మృతదేహాలను ఒడ్డుకు మెసుకొచ్చారు. కనీసం అక్కడున్న బోటు నిర్వాహకులు ఎవరూ సాయం చేయలేదని బాధితులు కన్నీటిపర్యాంతమయ్యారు.



ఆంధ్రజ్యోతి హెచ్చరించినా... మేల్కోని అధికారులు

గోదావరి తీరాన జరుగుతున్న తీరును.. చేపట్టాల్సిన చర్యలను ఆంధ్రజ్యోతి గ్రహించి జూన్ 2వ తేదీన 'ప్రాణాలు పోతున్నా పట్టదా!?' అనే శీర్షికన కథనం ప్రచూరించింది. మే 26న ఓ మహరాష్ట్రకు చెందిన యువకుడు, మరో వ్యక్తి గోదావరి నదిలో పుణ్యస్నానానికి దిగి వేర్వేరు ఘటనలో మృత్యువాత పడ్డారు. నదీ తీరంలో రక్షణ చర్యలు లేకపోవడ ప్రాణాలు పోతున్నాయని ఘటనస్థల ప్రదేశం ఫొటోలతో సహా వివరించినా అధికారులు మేల్కోలేదు. అధికారుల నిర్లక్ష్యంతో అమాయకులు ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు.


మృతులు వరుసగా రాకేశ్, వినోద్, రిత్విక్, భరత్, మదన్

జలసమాధి

- బాసర గోదావరి నదిలో మునిగి ఐదుగురు యువకుల మృతి
- నది స్నానాలు చేస్తుండగా నీటిలో గల్లంతు
- మృతులంతా హైదరాబాద్‌లో నివాసముండే రాజస్థానీయులు

బాసర, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సరదాగా బాసర వెళ్లి వద్దమనుకున్న ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. నదిలో పుణ్యస్నానాలకు దిగిన ఐదుగురు నీటిలో మునిగి మృతిచెందారు. ఆదివారం బాసర గోదావరి తీరంలో ఈ ఘటన వారి కుటుంబాల్లో విషాదయాత్రగా మిగిలింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని చింతల్‌బజార్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన సుమారు 20 మంది బాసర యాత్రకు బయల్దేరారు. రైలులో బాసరకు చేరుకొన్న వారందరూ మొదట గోదావరి నది తీరానికి వెళ్లారు. అమ్మవారి దర్శనం కంటే ముందుగా నది స్నానం చేద్దామని బోటులో నది మధ్యలోకి వెళ్లారు. కుటుంబ సభ్యులు ఒకచోట, అందులో యువకులంతా మరొకచోట స్నానాలు చేస్తున్నారు. ఈ క్రమంలో స్నానం చేస్తున్న యువకుల్లో ఐదుగురు నీటిలో మునిగి గల్లంతయ్యారు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అక్కడి అధికారులు, రక్షణ సిబ్బంది ఎవరికి చెప్పాలన్నా అక్కడ ఎవరూ కన్పించలేదు. దీంతో కుటుంబ సభ్యులే స్థానికుల సహాయంతో నీటిలో గల్లంతైన యువకులను వెతికారు. ఒక్కొక్కరిని ఒడ్డుకు చేర్చి సీపీఆర్ వంటి ప్రయత్నం చేసినా అప్పటికే రాకేశ్ (21), భరత్ (16), మదన్ (18), రిత్విక్ (18), వినోద్ (19) మృతిచెందారు. మృతదేహాలను ఒడ్డుకు చేర్చడానికి కనీసం సహాయం చేయడానికి అక్కడ ఎలాంటి అధికార వ్యవస్థ లేదు. దుఖంలో కుటుంబ సభ్యులే మృతదేహాలను నది ఒడ్డుకు చేర్చుకున్న హృదాయ విదారక ఘటన చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలించారు.

ముగ్గురు అన్నదమ్ముళ్లు మృత్యువాత

రాజస్థాన్‌కు చెందిన ప్రేమ్‌రావు, సోని దంపతుల కుమారులైె రాకేశ్, మదన్, భరత్ వ్యాపార సంస్థల్లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రేమ్‌రావు మినహా మిగతా వారందరూ ఆదివారం బాసర వచ్చారు. స్నానం చేస్తుండగా ముగ్గురూ నీటిలో మునిని మృతిచెదారు. చేతికొచ్చిన కుమారులు కొల్లదునే మృతిచెందడం ఆ తల్లి రోదనలు అందరినీ కలిచివేసింది.


మృతదేహాలను వెతుకుతున్న స్థానికులు



మృతదేహాలను బయటికి తీసుకొస్తున్న దృశ్యం


భైంసా ఆసుపత్రికి మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం


రోదిస్తున్న కుటుంబీకులు

రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

భైంసా. జూన్15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈఏడాది జూన్ 5 లోపు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికాని అంజీ ప్రసాద్ సూచించారు. జిల్లాలోని కొత్తగా మొత్తం 3,406 మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చినట్లుగా పేర్కొన్నారు. ఈనెల 18లోగా దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని వెల్లడించారు.

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం

నిర్మల్ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇటీవల ప్రకటించిన టీపీసీసీ కార్యవర్గంలో రాష్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన ఎంబడి రాజేశ్వర్‌కి ఆదివారం శాలువా, పూల మొక్కలతో ఘనంగా సన్మానించినట్లు ఆదివాసి కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కాంబ్లె సూర్యకాంతం, ఖానాపూర్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆర్. అశోక్, శేఖర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఎంబడి రాకేష్, అడెల్లి డైరెక్టర్ జగత్ ప్రసాద్ పాల్గొన్నారు.

'జొన్నల డబ్బులు విడుదల చేయాలి'

కుంటాల, జూన్15 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి రబీ సీజన్‌లో కొనుగోలు చేసిన జొన్నల డబ్బులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ జిల్లా నాయకులు రమణ రావు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడులను దృష్టిలో పెట్టుకొని త్వరగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చూడాలని పేర్కొన్నారు. స్పందించిన ఎండీ వారం రోజుల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

గజ్జలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

కుంటాల, జూన్15 (ఆంధ్రజ్యోతి): కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తింది. ఖరీఫ్ ప్రారంభమవడంతో వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు గజ్జలమ్మ ఆలయానికి వచ్చి పూజలు నిర్వహించి గజ్జలమ్మకు ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అడెల్లి పోచమ్మకు పూజలు

సారంగాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడెల్లి పోచమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు పోచమ్మ తల్లి దివించు తల్లి అంటూ మొక్కులను మొక్కారు. ఈ ఆలయానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల నుండే కాకుండా మహారాష్ట్ర నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరయి అమ్మవారికి మొక్కులను మొక్కి పెరుగన్నం నైవేద్యంగా సమర్పించారు. ఆలయానికి మొక్కలను తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కోకుండా ఉండడానికి ఆలయ చైర్మన్ భోజాగౌడ్ ఆలయ ఇంచార్జీ ఈవో రమేష్ అన్ని ఏర్పాట్లు చేశారు.

బెంబర్‌లో వైద్యశిబిరం

తానూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెంబర్ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. భైంసాకు చెందిన వైద్యుడు డా.నరేష్ బందెల ఆధ్వర్యంలో పిల్లలకు వైద్య సేవలను నిర్వహించారు. దాదాపు 100మంది పిల్లలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్‌లు శంకర్, శ్రీనివాస్, నాయకులు భోజన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో జాతిని జాగృతం చేయాలి

భైంసా, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పెట్రేగిపోతున్న మతతత్వ శక్తుల దుశ్చర్యల నుంచి జాతి జనాన్ని జాగృతం చేయాలని ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచార ప్రముఖ్ డా. వారే దస్తగిరి పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలో ఆర్ఎస్ఎస్ మహిషా విభాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ సామ్రాజ్య దినోత్సవ వేడుకకు ప్రధానవక్తగా హాజరై మాట్లాడారు. లౌకికత్వం పేరిట రోజురోజుకు మతతత్వశక్తుల ఆగడాలు, అకృత్యాలు అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిందువులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు, ఆలయాల ధ్వంసాలు, మతమార్పిడులు, లవ్‌జిహాద్ ఘటనలు నిత్యకృత్యంగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. జాతి జనం కులాలు, ప్రాంతాలుగా వీడిపోతుండటంతో, మనకెందుకులే అని మిన్నకుండి పోతుండటంతో దుశ్చర్యలు అధికమవుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి అకృత్యాలను అరికట్టేందుకు ఆర్ఎస్ఎస్ శ్రేణులు ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ఆదర్శకంగా తీసుకొని స్ఫూర్తిదాయకంగా ముందుకు సాగాలన్నారు. జాతి జాగృతమే లక్ష్యంగా, చైతన్యమే ధ్యేయంగా చర్యలు చేపట్టాలన్నారు. తల్లితండ్రులు ముందుగా చైతన్యవంతులై తమ పిల్లలకు అన్నివిషయాలపై అవగాహన కల్పించి జాగృతం చేయాలన్నారు. సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వార్లే మారుతి(యోగేష్), ఆర్ఎస్ఎస్ నిర్మల్ జిల్లా సహ సంఘచాలక్ సాధుల కృష్ణదాస్‌లు ముఖ్య అతిథులు పాల్గొన్న పట్టణ పరిధిలోని అయా ప్రాంతాల నుంచి ఆర్ఎస్ఎస్ శ్రేణులు భారీసంఖ్యలో పాల్గొన్నాయి.


మాట్లాడుతున్న డా.వారే దస్తగిరి

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

నిర్మల్‌రూరల్, జూన్15 (ఆంధ్రజ్యోతి): హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో 2025-26 సంవత్సరానికి 4వ తరగతి ప్రవేశానికి విద్యార్థిని విద్యార్థుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుంచి 19 వరకు మండల స్థాయిలో ఎంపిక ఉంటుందని, అందులో ఎంపికైన విద్యార్థులను జిల్లాస్థాయిలో ఈనెల 25 రోజున జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎంపిక ప్రక్రియ ఉంటుందని తెలిపారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్స్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల, 610 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బౌల్‌త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, ఎత్తు, బరువు, మొత్తం తొమ్మిది విభాగాల్లో 27 మార్కులకు గాను ఫిజికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పొన్కల్‌లో గ్రామ దేవతలకు జలాభిషేకం

మామడ, జూన్15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్కల్‌లో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని గ్రామస్థులు ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గోదావరి నుంచి నీరు తీసుకొచ్చి దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏటా ఇలా చేయడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు.

నల్దుర్తిలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

మామడ మండలంలోని నల్దుర్తి గ్రామంలో ఆదివారం రోజున గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగుండాలని కోరుకున్నారు.

ఘనంగా భీమన్న దేవుడి పండుగ

- గంగాజలంతో దేవతలకు అభిషేకం

నర్సాపూర్(జి), జూన్15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో భీమన్న దేవుడి పండుగను ముదిరాజ్ కులస్థులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముదిరాజ్ కులస్థులు ఉదయం నుంచే ఉత్సాహంగా డప్పు చప్పుళ్ల, బోనాలు, ఇతర సాంప్రదాయ వాయిద్యాలతో కూడిన ఊరేగింపుతో గోదావరి నదికి వెళ్లారు. అక్కడ పవిత్ర గంగాజలాన్ని (గోదావరి జాలలను) గడ ముంతల్లో సేకరించి, భక్తి శ్రద్ధలతో గ్రామానికి తిరిగి తీసుకొచ్చారు. అరంతరం ఈ పవిత్ర జలాలతో గ్రామ దేవతలకు, భీమన్న గదలకు (దేవతా విగ్రహాలు లేదా ప్రతిమలు) అభిషేకం నిర్వహించి, శుభ్రపరిచారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ భీమన్న దేవుడు తమకు అండగా నిలుస్తాడని, తమను కష్టాల నుండి కాపాడుతాడని ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేశారు. వర్షాలు బాగా కురిసి, చెరువులు, కుంటలు నిండి, భూమి సస్యశ్యామలంగా మారాలని, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో ముదిరాజ్ కుల పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.


గంగాజలం తీసుకువస్తున్న ముదిరాజ్ కులస్థులు

బాసరలో భక్తుల మృతి దురదృష్టకరం: కలెక్టర్

నిర్మల్, జూన్15 (ఆంధ్రజ్యోతి) : బాసర గోదావరి నదిలో భక్తుల మృతిపై కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం విచారం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె విడుదల చేసిన ప్రకటనలో హైదరాబాద్‌కి చెందిన భక్తులు బాసర దేవస్థాన దర్శనానికి వచ్చి గోదావరిలో స్నానం చేస్తుండగా ఐదుగురు మృతిచెందడం దురదృష్టకరమని తెలిపారు. గతంలోనే నది సమీపంలో మెట్లు ఏర్పాటు చేసిన ప్రాంతం మినహా ఇతర ప్రాంతాల్లో స్నానాలు నిషేధించామని పేర్కొన్నారు. దీనిపై భైంసా ఆర్డీవోతో మాట్లాడినట్లు తెలిపారు. ఘటనపై సమీక్షించి, సహాయక చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

అనుమతి ఉన్న ఘాట్‌లోనే స్నానం చేయాలి: ఎస్పీ

నిర్మల్ రూరల్: జిల్లాలోని పుణ్యక్షేత్ర దర్శనానికి వెళ్లి నదీ స్నానం ఆచరించడానికి వెళ్లి ఐదుగురు యువకులు నీటిలో మునిగి మృతిచెందడం బాధాకరమని ఎస్పీ జానకి షర్మిల విచారం వ్యక్తం చేశారు. భక్తులు అనుమతి ఉన్న స్నానఘాట్లలోనే స్నానం చేయాలని కోరారు.

'ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నది వద్ద దుర్ఘటనలు'

భైంసా, జూన్15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణి విధానాల మూలంగానే ప్రసిద్ధ క్షేత్రం బాసరలోని గోదావరి నది వద్ద దుర్ఘటనలు చోటు చేసుకుంటున్నాయని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా.కిరణ్ కోమ్రేవార్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆదివారం బాసర గోదావరి నదిలో పుణ్య స్నానాలు అచరించడానికి వెళ్లి ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని తెలిపారు. అక్కడ ప్రమాదం పొంచి ఉన్నా ప్రభుత్వం, అధికారులు ఎలాంటి హెచ్చరికలు, రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్లే ఇలా జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం కళ్లు తెలిచి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

నర్సాపూర్(జి), జూన్15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డొంగుర్‌గాం గ్రామానికి చెందిన జంగిపల్లి నర్సయ్య శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అయితే పోలీస్ పెట్రోలింగ్ వాహన డ్రైవర్ మహ్మద్ షాహిద్ సకాలంలో స్పందించి నర్సయ్యను కాలువ నుంచి బయటకు తీసి రక్షించాడు. నర్సయ్య పని నిమిత్తం నిర్మల్ వెళ్లి తిరిగి డొంగుర్‌గాంక తన మోటార్ సైకిల్‌పై వస్తుండగా, నర్సాపూర్(జి) దాటిన తర్వాత భారత్ పెట్రోల్ పంపు సమీపంలో భైంసా నుంచి నిర్మల్‌వైపు అతివేగంగా, అజాగ్రత్తగా వస్తున్న బస్సు నర్సయ్యను ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ పంజాబ్ రాష్ట్రానికి చెందిన దల్వీర్ సింగ్‌గా గుర్తించారు. నర్సయ్యను 108 అంబులెన్స్‌లో తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవం

నిర్మల్‌రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దేవరకోట దేవస్థానంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని నిర్వహించినట్లు నగర సంఘచాలక్ డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వక్త వరంగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు శివాజీ మహారాజ్ జీవితచరిత్రను ఆదర్శంగా తీసుకొని హైందవ ధర్మం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ్‌రెడ్డి, ఇందూర్ విభాగ్ సహకార్యవాహ, జిల్లా సంఘ చాలక్ నూకల విజయ కుమార్, అల్లాడి సూర్యనారాయణ, బొద్దుల అశోక్, మంచిర్యాల నాగభూషణం, గంగిశెట్టి ప్రవీణ్, కిన్నెర్ల రవి, తదితరులు పాల్గొన్నారు.